సాగునీటి సమస్యకు చెక్

- క్రాస్‌బండ్లతో డ్రెన్లలో అడ్డుకట్ట
- 40 క్రాస్‌బండ్ల ఏర్పాటు
- రూ.77 లక్షల మంజూరు

మామిడికుదురు: దాళ్వా సాగులో పంట పొలాలకు సాగునీటి సమస్య ఏర్పడకుండా ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ చేపట్టింది. ఏటా మాదిరిగానే డ్రెన్లలో అడ్డుకట్టలు (క్రాస్‌బండ్లు) ఏర్పాటు చేసేందుకు డ్రెనేజీ విభాగం అధికారులు ప్రణాళిక రూపొందించారు. డ్రెన్ల నుంచి గోదావరిలోకి వృథాగా పోతున్న నీటిని నిల్వ చేసి దాన్ని పంట పొలాలకు మళ్లించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి ఎక్కడెక్కడ క్రాస్‌బండ్లు ఏర్పాటు చేయాలన్న దానిపై కసరత్తు పూర్తి చేశారు. దానికి అనుగుణంగా ప్రతిపాదనలు పంపించడంతో క్రాస్‌బండ్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసింది. దాళ్వా పంట ప్రస్తుతం ఈనిక దశలో ఉంది. మార్చి 2 నుంచి 3వ వారంలో ఈనిక దశకు వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. అదే సమయంలో వరి పొలాలకు సాగునీరు ఎంతో అవసరం. ఈ క్లిష్ట సమయంలో సాగునీటి సమస్యను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మండలాల్లో క్రాస్‌బండ్ల ఏర్పాటు ఇలా..

పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో 40 క్రాస్ బండ్ల ఏర్పాటుకు రూ.77 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో ఇంత వరకు ఆరు క్రాస్‌బండ్లు ఏర్పాటు చేశారు. మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయి. మలికిపురం మండలంలో వేపచెట్టు డ్రెన్‌లో రెండు, గూడపల్లి డ్రెన్‌లో ఒకటి, కత్తిమండ, రామరాజులంక డ్రెన్లలో ఒక్కొక్కటి, రాజోలు మండలం కూనవరం డ్రెన్‌లో ఒకటి, బి.సావరం, నాగమయ్య డ్రెన్లలో ఒక్కొక్కటి, నామనపాలెం డ్రెన్‌లో రెండు, పొన్నమండ డ్రెన్లలో మూడు, ఈదరాడ, ముళ్లకాలువ డ్రెన్లలో ఒక్కొక్కటి, సఖినేటిపల్లి మండలం అంతర్వేది, గుడిమూల డ్రెన్లలో ఒక్కొక్కటి, ఆత్రేయపురం మండలం కట్టుంగ డ్రెన్‌లో రెండు, ర్యాలి, ఉచ్చిలి, వద్దిపర్రుల్లో ఒక్కొక్కటి, రావులపాలెం మండలంలో ఈతకోట డ్రెన్‌లో రెండు, దేవరపల్లి, పలివెల డ్రెన్లలో ఒక్కొక్కటి వంతున క్రాస్‌బండ్లు ఏర్పాటు చేస్తారు. కొత్తపేట మండలంలో చిలకలకోడు డ్రెన్‌లో మూడు, పలివెల డ్రెన్‌లో రెండు, అవిడి డ్రెన్‌లో ఒకటి వంతున క్రాస్‌బండ్లు ఏర్పాటు చేయనున్నారు. పి.గన్నవరం మండలంలో బెల్లంపూడి, రావిపాడు డ్రెన్లలో ఒక్కొక్కటి, మామిడికుదురు మండలంలో ఆదుర్రు డ్రెన్‌లో రెండు, అల్లికాలువ డ్రెన్‌లో ఒకటి, వాడబోది డ్రెన్‌లో రెండు క్రాస్‌బండ్లు ఏర్పాటు చేయనున్నారు.



గోగన్నమఠంలో ఏర్పాటు చేసిన క్రాస్‌బండ్

వృథాను అరికడతాం



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైతులకు సాగునీటి సమస్య ఏర్పడకుండా డ్రెన్లలో కీలక ప్రాంతాలను గుర్తించి క్రాస్‌బండ్లు ఏర్పాటు చేస్తున్నాం. డ్రెన్లలో అడ్డుకట్టలు వేసి సాగునీటి వృథాను అరికడతాం. సాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో ఇంజిన్ల సహాయంతో నీటిని పంట కాలువలకు మళ్లించి రైతులకు సాగునీరు అందిస్తాం. దీనికి సంబంధించి పక్కాగా చర్యలు తీసుకుంటున్నాం.

– బి.రమేష్‌బాబు, ఏఈ, మురుగునీటి పారుదల శాఖ, రాజోలు

క్లుప్తంగా

నూతన ఆలయాలకు శంకుస్థాపన

మామిడికుదురు: పెదపట్నంలంకలో నిర్మించనున్న బాల వీరభద్రస్వామి ఆలయ నిర్మాణానికి శిరిగినీడి గోపీనాథ్, హేమజ్యోతి దంపతులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. శ్రీశుభకృత్ నామ సంవత్సరం ఫాల్గుణ శుద్ధ పంచమి శుభ ముహూర్తాన 7.51 గంటలకు వేద మంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ భూమి పూజ కార్యక్రమం ఆద్యంతం వైభవంగా జరిపించారు. ఇదే ముహూర్తానికి లూటుకుర్రులో నూతనంగా నిర్మించనున్న శ్రీధనమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి గాడి సత్తిబాబు, సరోజిని దంపతులు శంకుస్థాపన చేశారు. అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

నేటి నుంచి సప్తాహం ప్రారంభం

మామిడికుదురు: పెదపట్నంలంక బొక్కావారిపాలెంలో కొలువుదీరిన సీతాసమేత పట్టాభి రామాలయంలో చతుర్ధ సప్తాహం శనివారం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ శుక్రవారం తెలిపింది. శ్రీశుభకృత్ నామ సంవత్సరం ఫాల్గుణ శుద్ధ పంచమి అశ్వని నక్షత్ర యుక్త మకర లగ్నంలో శనివారం ఉదయం 5.05 గంటలకు కలశ స్థాపనతో ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుందన్నారు. ఈ సప్తాహం వచ్చేనెల 4వ తేదీ శనివారం వరకు జరుగుతుందన్నారు.

క్యాన్సర్ బాధితుడికి చేయూత



క్యాన్సర్ బాధితుడికి సాయం అందజేస్తున్న సేవాసమితి సభ్యులు

రావులపాలెం: గ్రామంలోని కడలివారిపాలేనికి చెందిన మట్టపర్తి శ్రీను కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. సుమారు రెండేళ్లుగా క్యాన్సర్‌కు చికిత్స పొందుతున్నాడు. పేదరికంలో ఉన్న అతను దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. విషయం తెలుసుకున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు సమకూర్చిన రూ.16 వేలు నగదును బాధితుడి ఇంటికి వెళ్లి శుక్రవారం అందజేశారు. వైద్యం నిమిత్తం ఆర్థిక సాయంగా ఈ సాయాన్ని అందించినట్టు సేవా సమితి సభ్యులు తెలిపారు.

శోభకృత్ పంచాంగ ఆవిష్కరణ

అంబాజీపేట: ప్రముఖ సిద్ధాంతి కారుపర్తి నాగ మల్లేశ్వరరావు గణించిన శోభకృత్ నామ సంవత్సర పంచాంగాన్ని నన్నయ విశ్వవిద్యాలయ న్యాయాధికారి నందెపు నాగేంద్రరావు ఆవిష్కరించారు. ఈ మేరకు గురువారం పుల్లేటికుర్రులోని మల్లేశ్వరరావు సిద్ధాంతి స్వగృహంలో జరిగిన ఒక కార్యక్రమంలో నాగేంద్రరావు పాల్గొని 2023–24 పంచాంగాన్ని ఆవిష్కరించారు. త్వరలో సినీనటుడు బాలకృష్ణ చేతుల మీదుగా మల్లేశ్వరరావు సిద్ధాంతి రాసిన వాస్తు చంద్రికను ఆవిష్కరిస్తారని చెప్పారు.

రైతులకు సన్మానం



మామిడికుదురులో రైతులను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

మామిడికుదురు: కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సమ్మాన్ నిధి పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం రూపేణా ఏటా రూ.ఆరు వేలు సహకారం అందిస్తోందని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ పేర్కొన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానికంగా జరిగిన సమావేశంలో కిసాన్ సమ్మాన్ నిధి లబ్ధిదారులకు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రైతులు కడలి రామకృష్ణ, యర్రంశెట్టి మల్లేశ్వరరావు, కె.శివరావు, నిమ్మన నాగేశ్వరరావు, కంచి రామకృష్ణ, పార్టీ నేతలు కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, పి.నానాజీ, అడపా వెంకటరత్నం, పాలూరి సత్తిబాబు, నిమ్మన సతీష్ పాల్గొన్నారు.

వ్యక్తిని గాయపరిచిన ఇరువురిపై కేసు

అయినవిల్లి: ఓ వ్యక్తిని గాయపరిచిన కేసులో శుక్రవారం ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మడుపల్లికి చెందిన అనిశెట్టి సత్తిబాబును అదే గ్రామానికి చెందిన అతని చిన్నాన్న సుబ్రహ్మణ్యం కుమారులు వెంకటేశ్వరరావు, మణికంఠలు కుటుంబ కలహాలు నేపథ్యంలో చేతులతో గాయపరిచారు. దీని పై బాధితుడు సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



అరుణ్‌కుమార్ (ఫైల్)

పి.గన్నవరం: మండలంలోని వాడ్రేవుపల్లి వై.జంక్షన్ వద్ద శుక్రవారం రాత్రి టిప్పర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు గాయాల పాలయ్యాడు. పి.గన్నవరం ఎస్సై పి.గంగాభవాని తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వాడ్రేవుపల్లి శివారు చాకలిపాలేనికి చెందిన నేతల అరుణ్‌కుమార్ (30), గొల్లపల్లి రాజు పెయింటింగ్ పనులు చేస్తుంటారు. శుక్రవారం రాత్రి వీరిద్దరూ ఇంటి నుంచి బైక్‌పై జగన్నపేట సెంటర్‌కు వెళ్తున్నారు. వాడ్రేవుపల్లి వై.జంక్షన్ వద్ద వీరు ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి కింద పడిపోయింది. వెనుక వస్తున్న టిప్పర్ లారీ వీరిని ఢీకొట్టింది. ఈప్రమాదంలో అరుణ్‌కుమార్ తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలపాలైన గొల్లపల్లి రాజును రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఘనంగా ప్రింటర్స్ డే

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరంలో ప్రింటర్స్ డే శ్రీ కోనసీమ మాస్టర్స్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అక్షరదాత జాన్ గూటన్‌బర్గ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సంఘ అధ్యక్షుడు డీడీ సత్యనారాయణ జాన్‌గూటన్‌బర్గ్ కోసం వివరించారు. కార్యక్రమంలో ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు, సత్యమోహన్

అంబాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను వైఎస్సార్ సీపీ అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే కోనసీమ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ సతీష్, గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కన్వీనర్‌గా నియమితులైన దొమ్మేటి సత్యమోహన్ ఎమ్మెల్యేలు సతీష్, చిట్టిబాబులను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేలను పూలమాలతో సత్కరించారు. ప్రతిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సత్యమోహన్‌ను ఇరువురు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు సత్కరించి అభినందనలు తెలిపారు. తనకు పదవి వచ్చినందుకు సహకరించిన ఎమ్మెల్యేలు, పలువురు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేని కలసిన వారిలో సుదా బత్తుల రాము, కుసుమ శ్రీనివాస్, మట్టపర్తి బాలాజీ తదితరులు ఉన్నారు.

నేడు 4 గ్రామాల్లో అవగాహన

ఈ ఏడాది మార్చి 18 నుంచి చేపట్టే 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంపై నాలుగు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు శనివారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. పుల్లేటికుర్రు, కె.పెదపూడి, ఇసుకపూడి, చిరతపూడి గ్రామాల్లో ఈ సమావేశాలు జరుగుతాయన్నారు. సచివాల కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు హాజరు కావాలని ఎమ్మెల్యే సూచించారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



పినపళ్లలో ప్రతిష్ఠించిన పుంతలో ముసలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఆలమూరు: మండలంలోని పినపళ్లలో నూతనంగా నిర్మించిన పుంతలో ముసలమ్మ అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం వైభవంగా జరిగింది. స్థానిక పేపర్‌మిల్లు రోడ్డులో గ్రామస్తుల సహకారంతో నిర్మించిన ఈ ఆలయం వద్ద వేద పండితుల పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలు భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సర్పంచ్ సంగిత సుభాష్, ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభిరామన్న, వక్కపట్ల లక్ష్మణరావు, కోట బూరయ్య, చామకూరి శ్రీనివాసు, విజ్జన అబ్బు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ప్రభుత్వం



కత్తిమండలో గృహ సారథులకు కిట్లను అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: ప్రజలకు జవాబుదారీగా సీఎం జగన్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలోని కత్తిమండలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రామాలకు నూతనంగా నియమితులైన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు శుక్రవారం శిక్షణ తరగతులు జరిగాయి. ఎమ్మెల్యే రాపాక పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా తెలియజేసేందుకు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లు పూర్తి బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అమలు చేస్తుందని అవి ప్రజలకు ఏ విధంగా ఉపయోగ పడుతున్నాయో ఫీడ్ బ్యాక్ కూడా తీసుకోవాలని సూచించారు. పార్టీ అధిష్టానం మీపై ఉంచిన బృహత్తర బాధ్యతలు ఉంచిందన్నారు. బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తే రాబోయే ఎన్నికల్లోమంచి ఫలితాలు వస్తాయన్నారు. ఎన్నికలలో ఓట్లు అడిగే అర్హత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే ఉందన్నారు. శిక్షణ అనంతరం గృహసారథులకు కిట్లను ఎమ్మెల్యే రాపాక అందించారు. చింతా రాజబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల వీరబ్రహ్మాజీరావు, సర్పంచ్‌లు పెచ్చెట్టి నరసింహారావు, ఓగూరి నరసింహారావు, కోళ్ల వేణు ప్రసాద్, చింతా ప్రసాద్, కుమార్ రాజా, అడబాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: రాష్ట్రంలో ప్రజల మెచ్చిన పాలనను అందించాలంటే సీఎం జగన్‌తోనే సాధ్యపడుతోందని మరో సారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజలు పదవిని కట్టబెడతారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని శంకరాయగూడెం, క్రాప, కె.జగన్నాథపురం, పోతుక్రుర్రుల్లో మార్చి 18న జరగబోయే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లకు, గృహ సారథులకు, నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఎం జగన్ పాలనలో ప్రజలకు అన్ని విధాలా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. కరోనా వంటి విపత్తులు విజృంభించిన పథకాలను మాత్రం ఎక్కడ ఆపలేదన్నారు. అన్నింటా ప్రజలకు అండగా నిలిచారన్నారు. ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, మట్టపర్తి రామారావు, మేడిశెట్టి శ్రీను, సరిపల్లి కనకరాజు, నంబూరి రాంబాబు తదితరులు ఉన్నారు.

రైతుల సమక్షంలోనే జగనన్న భూరక్ష



పెదపళ్లలో సరిహద్దు రాళ్ల ప్రక్రియను పర్యవేక్షిస్తున్న జేసీ ధ్యానచంద్ర

ఆలమూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న భూరక్ష పథకాన్ని వేగవంతం చేసి రైతుల సమక్షంలోనే సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర అన్నారు. మండలంలో ఇప్పటికే భూసర్వే పూర్తయిన గుమ్మిలేరు, చింతలూరు, పెదపళ్ల తదితర గ్రామాల్లో కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటితో కలసి శుక్రవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో జగనన్న భూరక్ష వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఏఓ ఎస్.లక్ష్మీలావణ్య, ఏపీఓ వి.కామత్ రామచంద్రరావు, కార్యదర్శులు వెంకటరెడ్డి, వేణు, డి.సుబ్బారావు, వీఆర్వోలు వెంకట్, రాజశేఖర్, ఉదయ్‌కుమార్, దార్ల అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన



పోతవరంలో ప్రభుత్వ స్థలాల మ్యాప్ పరిశీలిస్తున్న ఆర్డీఓ ముక్కంటి

పి.గన్నవరం: అగ్నిమాపక కేంద్ర భవన నిర్మాణం కోసం పోతవరంలో ప్రభుత్వ స్థలాన్ని కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి శుక్రవారం పరిశీలించారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కృషితో నియోజకవర్గానికి అగ్నిమాపక కేంద్రం మంజూరైంది. దీనిని పోతవరంలో నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదించారు. కార్యక్రమంలో ఆర్ఐ పి.నరసింహారావు, వీఆర్వో కె.తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

అనుబంధ విభాగాల్లో సముచిత స్థానం



కుర్రా శ్రీనివాసరావు



కనపాల బాబూరావు

కొత్తపేట: వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల్లో కొత్తపేట నియోజకవర్గానికి సముచిత స్థానం లభించింది. మొత్తం 16 విభాగాలకు అధ్యక్షులను పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సూచనల మేరకు పార్టీ అధిష్టాన వర్గం ఎస్సీ, ఎస్టీ విభాగాల అధ్యక్ష పదవులు నియోజకవర్గానికి కేటాయించారు. దాంతో ఆయా వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఎస్సీ జిల్లా విభాగానికి ఆత్రేయపురం మండలం ర్యాలికి చెందిన రాష్ట్ర అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ డైరెక్టర్ కప్పల శ్రీధర్ నియమితులయ్యారు. జిల్లా ఎస్టీ విభాగం అధ్యక్షుడిగా కొత్తపేటకు చెందిన కుర్రా శ్రీనివాసరావును నియమించింది. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ తనను జిల్లా ఎస్టీ విభాగం అధ్యక్షుడిగా నియమించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గంలో ఇద్దరు నాయకులకు జిల్లా స్థాయి పదవులు లభించడంపై జెడ్పీటీసీ జి.రమాదేవి, ఎంపీపీ ఎం.గంగాధరరావు తదితర నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

క్రిస్టియన్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా బాబూరావు

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ విభాగం అధ్యక్షుడిగా కనపాల బాబూరావును నియమించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తనను జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నియమించారని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయని బాబూరావు శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. ఆయన రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, పార్టీ విప్ చిర్ల జగ్గిరెడ్డిలను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్‌తో కలసి 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు.

విష్ణు సహస్రనామ, భగవద్గీత శ్లోకాలపై తర్ఫీదు

అంబాజీపేట: గ్రామంలోని కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో విష్ణు సహస్రనామ, భగవద్గీత శ్లోకాలపై తర్ఫీదు ఇవ్వనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి నరసింహాచార్యులు తెలిపారు. రాబోయే ఉగాది నుంచి ప్రతి ఆదివారం ఉదయం తొమ్మిది నుంచి పది గంటల వరకు విష్ణు సహస్రనామం, భగవద్గీత శ్లోకాలను చదివించడంతో పాటు వాటిలో ఉన్న అర్థం, పరమార్థాలను వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తాగునీటి పనులను సత్వరం పూర్తి చేయాలి



నగరంలో తాగునీటి పైప్‌లైన్ పనుల్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: నగరంలో గెయిల్ నిధులు రూ.ఆరు కోట్లతో చేపట్టిన తాగునీటి పథకం పనుల్ని సత్వరం పూర్తి చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సూచించారు. స్థానికంగా జరుగుతున్న పనుల్ని ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. పైప్‌లైన్ నిర్మాణం పనుల్ని ఈ వేసవిలో పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గెయిల్ నిధులతో చేపట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణం ద్వారా గ్రామంలో ప్రతి ఒక్కరికి ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్నారు. పంటకాలువ నుంచి మెయిల్ స్టోరేజ్ ట్యాంకు వరకు చేపట్టిన పైప్‌లైన్ పనుల్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. గ్రామంలో నాలుగు ట్యాంకుల నిర్మాణం పనుల్ని పూర్తి చేశామన్నారు. గ్రామంలో పీపీ పాలెం, జాలెం వారి గ్రూపు, మొల్లేటి వారి మెరక, పితానివారి పాలెం ప్రాంతాల్లో నూతనంగా ట్యాంకులు నిర్మించామన్నారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో పైప్‌లైన్ నిర్మాణం పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే చిట్టిబాబు పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ పనుల్ని పూర్తి చేసి నగరం గ్రామ ప్రజలకు తాగునీరు అందించే దిశగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఆయన వెంట అప్పనపల్లి దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఉప సర్పంచ్ అన్వర్‌తాహిర్ హుస్సేన్, పార్టీ నేతలు జాలెం కృష్ణారావు, తాడి రామకృష్ణ, కడలి శ్రీను, తవిటికి వెంకన్నబాబు, వానరాశి బాబి, తాడి సత్యనారాయణ ఉన్నారు.

ఈనాడు ప్రతుల దహనం

అయినవిల్లి: ప్రజలను తప్పుదారి పట్టించేలా ఈనాడు ప్రతిక అసత్యకథనాలు వండి వారుస్తోందని, చంద్రబాబునాయుడును సీఎం చేయాలనే కుట్రతో దిగజారుడు వార్తలను ప్రచురిస్తుందని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మండిపడ్డారు. శుక్రవారం మండలంలోని పోతుకుర్రులో ఈనాడు దినప్రతిక ప్రతులను పార్టీ నాయకుల ఆధ్వర్యంలో దహనం చేశారు. టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభినీ కొట్టారని ఈనాడు తప్పుడు రాతలు, తప్పుడు ఫొటోలు ప్రచురించడంపై నిరసన తెలిపారు. ఈనాడు దినపత్రిక అధినేత రామోజీ తీరుపై మండిపడ్డారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, బొంతు రాజేంద్ర, గుత్తుల నాగబాబు, వాసంశెట్టి పుల్లంశెటి, కమిడి వెంకటేశ్వరరావు, పులిదిండి ప్రభాకర్, బొక్కా కామేశ్వరరావు, కొనే చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ఇన్‌చార్జి ఎంఈవోగా కనకదుర్గ

అంబాజీపేట: మండల విద్యాశాఖాధికారి(ఎంఈవో)గా జయంతి వెంకట కనకదుర్గ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అయినవిల్లి మండల ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న ఆమె అంబాజీపేట మండల ఇంచార్జి ఎంఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఇంత వరకు ఇక్కడ పనిచేసిన ఎంఈఓ క్రిష్టోఫర్ కర్నోలియస్ ఆరోగ్యరీత్యా సెలవుపై వెళ్లడంతో డీఈఓ ఆదేశాల మేరకు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

నేటి నుంచి శ్రీలక్ష్మీ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆలయ దాత పాతపాటి రమణరాజు కుటుంబ సభ్యులు



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: స్థానికి శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలను ఈ నెల శనివారం నుంచి మార్చి 1 వరకు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు ప్రారంభించినట్లు ఆలయ నిర్మాత పాతపాటి వెంకట సత్యనారాయణరాజు, సోదరులు, కుటుంబ సభ్యులు తెలిపారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పాతపాటి కుటుంబ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని 25న ఉదయం సంకల్పం, విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, అకల్మష హోమం, దిగ్దేవతా ప్రార్థన తదితర పూజలు జరుగుతాయన్నారు. 26న స్వామి వారికి విశేష హోమం, ఎదురు కోలోత్సవం, కల్యాణోత్సవం, హనుమత్ వాహోత్సవం, 27న స్వామికి చతుర్థ కలశారాధన, పంచామృతాభిషేకం, మహిళలతో సామూహిక లక్ష కుంకుమార్చన, సాయంత్రం 108 తామర పువ్వులతో మహాలక్ష్మి హోమం అనంతరం సింహవాహనంపై ధార్మిక ఉత్సవాలు, 28న స్వామికి మహాసుదర్శన అభిషేకం, హోమం, శంఖుచక్ర నామార్చన, సహస్ర దీపాలంకరణ, ఉజ్వలసేవ, రాత్రి గరుడ వాహనోత్సవం, మార్చి 1న మహా శాంతి హోమం, శ్రీవారి చక్రస్నానం, నదీ తీరంలో దీక్షా విసర్జన, ధ్వజారోహణం, భారీ అన్నసమారాధన, పల్లకీ ఉత్సవం, స్వామి వారి పుష్పయాగం, ఏకాంత సేవా దర్శనం, తదితర పూజలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండకు చెందిన వైఖానస మహదాచార్య శ్రీమాన్ ఖండవల్లి సూర్యానారాయణాచార్యులు, సుదర్శనం సూర్యపురుషోత్తమ సాయి పర్యవేక్షణలో టీటీడీ వేదపండితుల బృందం సభ్యులు ఆధ్వర్యంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు వెంకట సత్యరాజ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పాతపాటి రమణరాజు తెలిపారు.

రోగికి ఆర్థిక సాయం



జాన్‌కు సాయం పంపిణీ చేస్తున్న శివకుమార్

మలికిపురం: మండలంలోని ఇరుసుమండకు చెందిన టేకు జాన్‌కు శుక్రవారం గల్ఫ్ శెట్టిబలిజ యవశక్తి సేవా సంస్థ ద్వారా రూ.21 వేల ఆర్థిక సాయం పంపిణీ చేశారు. ఈ మేరకు పై మొత్తాన్ని రాష్ట్ర నెడ్‌క్యాప్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ యువజన కార్యదర్శి పాటి శివకుమార్, రోగి జాన్‌కు అందజేశారు. జాన్ గత కొంత కాలంగా బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. రాష్ట్ర శెట్టిబలిజ సంఘ కార్యదర్శి గుబ్బల శ్రీనివాస్, గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సంస్థ అధ్యక్షుడు కట్టా భాస్కర్, సభ్యులు దొంగ శ్రీనుబాబు, కడలి కపిల్ పాల్గొన్నారు.

అయినవిల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

అయినవిల్లి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పొటెన్షియల్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సాంకేతిక సమస్య తలెత్తడంతో పొటెన్షియల్ ట్రాన్స్‌ఫార్మర్ శుక్రవారం దగ్ధమైనట్లు ఎలక్ట్రికల్ ఏఈ అప్పారి హరిబాబు తెలిపారు. ఈ పొటెన్షియల్ ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ సరఫరా ఎంత శాతం అవుతోంది తెలుపుతుందని ఇది ఒక్కసారిగా సాంకేతిక సమస్య రావడంతో పెద్ద శబ్దంతో అందులోని ఆయిల్ పైకి ఎగజిమ్ముతూ పేలిందన్నారు. ఆ సమయంలో సిబ్బంది అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పిందన్నారు. ఈ ఆయిల్ పొగలు కక్కుకుంటూ కింద పడిందన్నారు. ఇందులోని మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాత మారుస్తామన్నారు. దీని స్థానంలో కొత్తది ఏర్పాటు చేయడానికి శాఖా పరంగా అన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎగసి పడుతున్న మంటలు

